


# తెంపు

శ్రీ పి. వి. సుబ్బారావు.

1918 వ సంవత్సరమువచ్చి 20 రోజులయింది. మోహనరావు యీజీఛైరులోకూర్చుని పేపరు చదువుకొంటూవుంటాడు. వయసు 30 సంవత్సరాలు. ఆకారము అందమైనది. ఆ గదిలోనే ఓ ప్రక్కన ఒక అద్దాల బీరువా వుంది. దాన్నిండా కుట్లు వూడిపోయినవి, కాఫీ మరకలు పడ్డవి, సగము చిరిగి సగము చిరగకుండా శల్యావస్థలోనున్నవి, రకరకాల పుస్తకాలు వున్నవి. అదే మోహనరావు అతని భార్య అనసూయల 'రీడింగ్ రూమ్' కిటికీలోంచీ ఉసురుగా కొడుతున్నగాలికి చేతిలోని పేపరు రెపరెప కొట్టుకుంటుంది. రెండుచేతులతో పత్రిక గట్టిగా పట్టుకొని చదవటానికి ప్రయత్నిస్తాడు. కాని సాధ్యంకాదు. పత్రిక చిరిగేటట్టుంటుంది. అనసూయను కేకవేస్తాడు. అనసూయవచ్చి కిటికీ తలుపులు మూస్తుంది. అనసూయ వయస్సు 21 సంవత్సరాలు, ఎఱ్ఱగా బాగావుంటుంది. ఆ తుమ్మెదల్లాంటి వెంట్రుకలు, ఆ నీలాలాంటికళ్ళు, మెత్తటి మృదువైన ఆచెక్కిళ్ళు, నవ్వినప్పుడల్లా ఆచెక్కిళ్ళల్లో పడే సుడిగుండాలు చూట్టానికి ముచ్చట వేస్తయి. కిటికీ తలుపులు మూసివచ్చి మోహనరావు ప్రక్కనవున్న కుర్చీలో కూర్చుంటుంది. చూట్టం అయిపోయిందన్నట్టుగా నిశ్వాసవిడుస్తూ పేపరు మడత పెడుతూ అనసూయవంక చూస్తాడు.

మోహనరావు:-అనూ! నీవు కవిత్వము బాగా రాస్తావుగదా కవిత్వాన్ని మెచ్చుకోగలవా?

అనసూయ: మంచిప్రశ్నే, నా కవిత్వాన్ని అప్పుడప్పుడు మెచ్చుకో లేనుగాని అసలు కవిత్వాన్ని మెచ్చుకోలేకపోవట మేమిటి! కవిత్వంలోని అందాన్ని బాగా అనుభవించగలను.

మోహనరావు:-అవును, అట్లా అనుకొని భ్రమపడుతున్నావు. నీవు కవిత్వము రాయగలవేగాని మెచ్చుకోలేవు. నాకు మట్టుకు నేను 'కారమ్స్' బాగా ఆడగలనేగాని, నా ఆటను, ఆడటంచేతగాని నీవు మెచ్చుకొన్నంతగా నేను మెచ్చుకోలేను. అంతే నీ కవిత్వం సంగతికూడా.

అనసూయ:-ఏమో నబ్బా నేనుమాత్రం కవిత్వాన్ని బాగా మెచ్చుకుంటాను.

మోహనరావు:-ఒకవేళ అవునేమో. కవిత్వము రాయటం చేతగానినేను కవిత్వాన్ని మెచ్చుకున్నంత నగ్నంగా కవిత్వమురాసే నీవు మెచ్చుకోలేవని రూఢిగా చెపుతాను.

అనసూయ: ఎందుచేత?

మోహనరావు:-కళాసేవకుడు (artist) ఎప్పుడూ కళను ప్రేరేపించ గలడేగాని ప్రేమించలేడు. ఒకవేళ ప్రేమించగలిగినా కళాపిపాసకుడు (amateur) ప్రేమించగలిగినంత గొప్పగా ప్రేమించలేడు. అది ప్రకృతిలో సహజమే.

అనసూయ:-అయితే కళాపిపాసకుడు కళను ప్రేమించి కళాసేవకుణ్ణి ప్రేరేపించుతాడన్నమాట

మోహనరావు:-అవును కళాసేవకుడు కళను ప్రేరేపించితే కళాపిపాసకుడు కళాసేవకుణ్ణి ప్రేరేపించుతాడు. అంతే అవునుగాని చెప్పటం మరిచి

పోయీ రామారావు రేపువస్తాడట. ఉత్తరం వచ్చింది.

(రామారావు పేరు వినేసరికి అనసూయ వివర్ణ అయి దిగులు మొఖం పెట్టుకుంటుంది. మోహనరావు కవరు అందిస్తూ అదంతా కనిపెడుతూనే వుంటాడు.)

మోహనరావు:-అనూ. నిన్నో ప్రశ్న వేస్తాను కోపం తెచ్చుకోవుగద?

అనసూయ:-(కొద్దిసేపాగి) ఏమిటా ప్రశ్న.

మోహనరావు:-చొరవచేసి నే నడుగుతున్న ప్రశ్నకు క్షమించాలి. కోపం రాకూడదు.

అనసూయ:-(మౌనంగా వుంటుంది)

మోహనరావు:-జౌనా- రామారావు పేరు వినేసరికి నీమోము కళా విహీనమవటానికి కారణం చెప్పాలి. అతను నీకు చిరకాల స్నేహితుడని చెప్పి గూడా యిన్ని అతను వచ్చినపుడు సరీగ్గా మాట్లాడనన్నా మాట్లాడక అతన్ని నన్ను సంకట పెట్టావు. అనూ. కారణం చెప్పవూ?

అనసూయ:-(మొఖము అటువైపుకు తిప్పుకొని కళ్ళ వెంట బొటబొట నీరు కారుస్తూ వుంటుంది. మొఖమేమో నల్లటి కప్పుపూసినట్లవుతుంది.)

మోహనరావు:-అనూ! అనూ!!

అనసూయ:-(ఓ పెద్ద నిశ్వాస విడుస్తుంది.)

మోహనరావు:-అనూ కోపం వచ్చిందా క్షమించు. కాని రేపుమాత్రము నీవు అతనితో సరీగ్గా మాట్లాడకపోతే నా మనస్సు చాలా సంకట పడుతుంది. (అనసూయ పులకరించే శరీరంతో కళ్ళవెంబడి కారుతున్న నీటిని చెంగుతో తుడుచుకొంటూ వుంటుంది) పోనీ, నీకు అతను రావటం యిష్టము లేకపోతే చెప్పు. అతన్ని మన యింటికి తీసుకొనిరాను.

అనసూయ:-(నెమ్మదిగా) నాకెందుకు కష్టము మోహన్.

మోహనరావు:-ఈవేళ అనవసరంగా నిన్ను కష్ట పెట్టాను. నన్ను క్షమించు అనూ.

౨

[మరుసటిరోజు అనుకున్న ప్రకారము రామారావు వస్తాడు. రామారావు 27 సంవత్సరాల ప్రాయమువాడు. కళకొరకు పాటుపడే మనిషి. కళకొరకే బ్రతుకుతున్నట్లు కనుపించే స్వభావం. కళలోతు బాగా తెలుసుకున్నవాడు. శిల్పములో సిద్ధహస్తుడు. రామారావు భావోద్రేకుడు (sentimentalist) కావటంచేత స్వార్థానికి ప్రాకులాడే తత్వము అతనిలో బాగా బలిసివుంది. మోహనరావు, రామారావులు రీడింగ్ రూమ్‌లో కూర్చుని వుంటారు. మీటుతూ వున్న వీణను మీటటం ఆపుతుంది అనసూయ. రామారావు సిగరెట్టు పీలుస్తూ కిటికీలోనుంచి ఆకాశం వైపు చూస్తుంటాడు. మోహనరావు బీరువాలోని పుస్తకాలు సర్దుతూ కుట్లు వూడిపోయిన ఒక పుస్తకాన్ని పేజీలు సరిజేస్తూ వుంటాడు.]

మోహనరావు:-(రామారావు వైపు చూడకుండానే) రామూ, మా లైబ్రరీలోని పుస్తకాలు చూస్తావా?

రామారావు:-చూస్తాను గాని మోహన్ అనసూయ లోపల ఏం చేస్తుంది.

మోహనరావు:-అనూ. అనూ. (లోపలనుంచీ కాళ్ళ sandals చప్పుడు చేస్తూ వస్తుంది) ఏం జేస్తున్నావు లోపల అనూ? (రామారావు వైపు తిరిగి) రామూ, నిన్న కళాసేవకుడు కళను ప్రేమించలేడన్న సంగతి తేల్చుకున్నాము మేమిద్దరమూ.

రామారావు:-(అనసూయవంక చూస్తూ) అవునా?

అనసూయ:-అవును. నిజమే.

మోహనరావు:-అయితే రామూ, కళ దేనికొరకుండాలో చెపుతావూ?

రామారావు:-కళ, కళకొరకే.

అనసూయ:-బాగావుంది. నా వుద్దేశ్యమూ అంతే.

మోహనరావు:-అవును. కళాసేవకులు. మీ యిద్దరి భావాలు ఒకటి గాక. కాని నాకుమాత్రం అది సరిగ్గా బోధపడలా.

రామారావు:-ఏముందీ. కళ అనేది దేనికొఅకు బ్రతకటంలా; దానికొఅకే జీవిస్తుంది. కళ కళ కొఅకే

జీవిస్తున్నానని ఎప్పుడు తెలియజేస్తుందో అప్పుడే అది 'కళయొక్క నిజ స్వరూపంలో చెప్పిలుతుంది' అని అనిపించుకుంటుంది.

అనసూయ:-అంతే గాని కళాసేవకుడు కళను దేని కొరకైనా సృష్టిస్తానికి ప్రయత్నం చెయ్యగూడదు. అసలు నిజమైన కళాసేవకుని పని అది కాదు. కళ కొరకు తన కళను తీర్చి దిద్దుతూ చెక్కవలసిన చోట నగిషీ చెక్కుతూ సేవ చేస్తాడే కాని దేనికొఱకూ తన కళను వినియోగించి దాన్ని హత్య చేయుడు.

మోహనరావు:-అయితే అనూ, నీవు కవిత్వము రాసేది కవిత్వము కొఱకే నన్నమాట!

రామారావు:-అవును అనసూయ ఆ కవితా సమాధిలో వుండి దేనికొఱకూ గాక కవిత్వముకొఱకు చేసే కవితాగానములో వుంటుంది గాని కళ ఎప్పుడు బడితే అప్పుడు నీవు చెప్పమన్న దాని మీద చెప్పేది కవిత్వమవుతుందా, అసలు అందులో కళ వుంటుందా.

మోహనరావు:-అట్లా అయితే కళ అంతా పనికి మాలింది. కళ కొఱకు చేసే సేవ వ్యర్థమని నా ఉద్దేశ్యము.

అనసూయ:-అయితే కళ దేనికొఱకు వుండాలి?

మోహనరావు:-మానవుని కొఱకు. మానవాభ్యుదయమే కళయొక్క పరమావధి. ఎప్పుడైతే కళ విశ్వశ్రేయస్సును ప్రతిపాదించుతుందో అప్పటితోగాని కళాసేవకుని పని పూర్తిగాదు. అప్పుడే అతనికి విశ్రాంతి. కళ వుండవలసింది మానవుని కొఱకు గాని కళ కొఱకు గాదు.

రామారావు:-అయితే కళను కట్టుబాట్లలో వుంచి హత్యచేయమంటావా.

మోహనరావు:-అదికాదు రామూ. నీవు ముందు సంఘసేవకుడవూ తరువాత కళాసేవకుడవు అని గుర్తుంచుకోవాలి. సంఘసేవ చేయలేని కళ కాల్పనా. అసలు కళ కట్టుబాట్లకు లోబడి వుండగలిగినప్పుడే ప్రకాశిస్తుంది.

అనసూయ:-(రామారావు వైపు తిరిగి, ఇంతే; మోహన్ నాకు కళను గురించి రోజుకు ఒక్క పాఠమైనా నేర్పుతుంటాడు.

రామారావు:-(మోహనరావుని చూస్తూ, ఎప్పుడూ గూడా కళాసేవకునికి కళను గురించి నేర్పేది కళోపాసకుడే కాదూ?

మోహనరావు:-అవును. నిజమే. (చివాలున లేచి యిప్పుడే వస్తానన్న భావము నడకలో చూపిస్తూ బైటకు వెళ్ళుతాడు. ఒక్క నిమిషము వరకూ మౌనం. అనసూయా రామారావులు ఒకళ్ల నొకళ్ళు తేరిపార చూచుకుంటానికి జంకుతారు. అనసూయ తలవంచుకుంటుంది. చివరకు రామారావే ధైర్యంచేసి తల యెత్తి అనసూయ వంక చూస్తాడు. అనసూయ ఒక పెద్ద నిశ్వాస విడుస్తుంది.)

రామారావు:-అనసూయా, ఏమిటి ఆలోచిస్తున్నావు?

అనసూయ:-అబ్బే, ఏమీ లేదు నీవే ఏదో ఒక రకంగా కనపడుతున్నావు రామారావ్.

రామారావు:-ఎట్లా కనపడుతున్నాను?

అనసూయ:-నిన్ను చూస్తానికి భయం వేస్తుంది. రామారావ్, నీవు నిజంగా గ్రహణానికి ముందుండే చంద్రుని లాగా వున్నావు. కారణం?

రామారావు:-అనసూయా, నీవు దగ్గర వున్నంతసేపూ ప్రపంచాన్ని మరిచిపోతాను.

అనసూయ:-అట్లా మరిచిపోగూడదు. తెలిసిందా.

రామారావు:-అనసూయా నీవు దగ్గర లేనిదే కళకొఱకు కాస్తగూడా పాటుపడలేను. నిజంగా నిన్ను చూడకుండావుండి కళకుపెద్ద అపకారాన్ని చేస్తున్నా, అబ్బ! యిక చేయలేను.

అనసూయ:-రామారావ్ మోహనుని కొఱకైనా నీవు నీకళకు అపకారము చేయక తప్పదు. అతడు నీ స్నేహితుడు.

రామారావు:-అవును ఒకప్పుడు; ఇక మా యిద్దరికి స్నేహము కుదురుట కష్టము. అది నే నిదివరకే నిర్ణయించుకొన్నాను

అనసూయ:-రామారావ్ మోహనునికి ఏమాత్రము గలిగినా నేను సహించలేను. నాకు తెలుసు

మీ యిద్దరూ యివ్వాళ దెబ్బలాడుకుంటారు. రామారావ్, నీవు త్వరగా వెళ్ళిపోవాలని నాకోరిక.

రామారావు:-అనసూయ ఆజ్ఞను ఉల్లంఘించటం నాకు చాతగాదు. ఇప్పుడే వెళ్తా (అని లేచి నిలుచుంటాడు. అనసూయ కళ్ళవెంబడి నీళ్ళు గిర్రున తిరుగుతయి. చివాలున అనసూయగూడా లేచి నిలుచుంటుంది. రామారావును అనసూయ వంకచూస్తూ దీనంగా రెండడుగులు వేస్తాడు. అనసూయ తల నేలకువాల్చి)

అనసూయ:-రామారావ్ కూర్చో (రామారావ్ ఉక్కిరి బిక్కిరి మనకుండా వచ్చి కూర్చుంటాడు. ఇద్దరూ ఐదు నిమిషాలదాకా మౌనం. ఇంతలో మోహనరావు వస్తాడు. వస్తూవస్తూనే యిద్దరి మొఖాలవంకా చూస్తాడు. అనసూయ దగ్గరకు వెళ్ళి నిలబడి)

మోహనరావు:-(అనసూయ చేతులు రెండూ పట్టుకొని) అనూ, మాకు కాఫీ కాచిపెట్టాలి.

రామారావు:-కాఫీ? అనసూయా??

అనసూయ:-అవును నేనే అయితే కాఫీకాస్తానికి నాకు సహాయం రామారావు వస్తాడుగా.

రామారావు:-తప్పకుండా.

మోహనరావు:-రామూ వెళ్ళటానికి వీల్లేదుగా (రామారావు చేతులురెండూ పట్టుకుంటాడు. అనసూయవచ్చి చేతులు విడదీస్తుంది)

అనసూయ:-రామారావ్ రా లోనికి.

రామారావు:-(పిల్లిమాదిరిగా లోపలికి వెళ్లుతాడు.)

(మోహనరావు కుర్చీలోకూర్చొని దీర్ఘంగా ఆలోచిస్తుంటాడు. మనస్సంతా చికాకుగా వుంటుంది. ఏమీ పాలుపోదు. నిద్రలాంటి ఓమత్తులో వుంటాడు. అనసూయ రామారావుని లోపలికి తీసికొని వెళ్తుంది.)

రామారావ్:-అనసూయ, కాఫీకాసేటప్పుడు నీవు నాకు ఒకపని చేసిపెట్టాలి.

అనసూయ:-ఏమిటా పని.

రామారావు:-తప్పక చెయ్యాలి (అంటూ గబగబా వెళ్లి వీణపట్టుకొస్తాడు) అనసూయ, నవ్వుతుంది. రామారావు దీనంగా చూస్తాడు) అనసూయా, నీవు యీ వీణను మీటుతూ నా కెదురుగా కూర్చుంటే కాఫీ నేనేకాస్తా. నీ వ్రేళ్ళువీణను మీటడానికేగాని పాడు పొయ్యి లోపెట్టడానికి గాదు సృష్టించబడ్డది.

అనసూయ:-(వీణను మీటుతూ వుంటుంది. రామారావు కళ్ళు అన్నీ ఎఱ్ఱ చేసుకొని పొయ్యితో అవస్థ పడుతుంటాడు. ఐదు నిమిషాలు గడిచి పోతుంది)

అనసూయ:-రామారావ్ నీవు నీ స్నేహితునకు ద్రోహం చేస్తున్నావు. తెలిసిందా.

రామారావు:-అనసూయా, ఏమి చేయమంటావు.

అనసూయ:-నీ స్నేహితునిమీద నీకు ప్రేమలేదూ?

రామారావు:-ఉన్నది ఒకప్పుడు కాని ప్రేమ స్థానాన్ని ఈర్ష్య దొంగిలించింది. ఏంచేసేది.

అనసూయ:-(కోపంగా) ఇంతేనా నీహృదయం? అంత సంకుచితుడవు కాకు రామారావ్.

రామారావు:-అనసూయా కోపంవచ్చిందా? క్షమించు నీవు బాధపడితే చూడలేను.

అనసూయ:-బాధకాదూ, నా భర్తకు ద్రోహముచేయ బోతున్నావు.

రామారావు:-అబ్బ అనసూయా! మరి నా ప్రేమకో.?

(అనసూయ కళ్ళవెంబడి బొట బొట నీరు కారుస్తూ వీణను తడుపుతుంది. కళ్ళు గిర్రునతిరిగినయి. వీణను పచ్చిపచ్చిగా మెట్లువేస్తుంది. రామారావు బాగా మండేపొయ్యినే ఎగదోస్తూ వుంటాడు తన్మయత్వములో మోహనరావు నెమ్మదిగా వచ్చి నిలుచుంటాడు. అతన్ని ఎవ్వరూ చూడరు)

మోహనరావు:-(నవ్వుతూ) రామూ, కాఫీ తయారు చేశావా (అనసూయా రామారావులు ఉలిక్కిపడి చూస్తారు)

అనసూయ:-(నవ్వుతూ) చేస్తాడు మనము బైటకు వెళ్ళితేగాని త్వరగా చేయడు. (మోహనరావు చెయ్యి పట్టుకొని బైటకు తీసికొని పోతుంది)

రామారావు:-అనసూయా వుండవూ

మోహనరావు:-నేనుండనా రామూ? (రామారావు మౌనంగా వుంటాడు.)

అనసూయ:-ఎవ్వరూ వుండనక్కరలా కాఫీ కాసి యిప్పుడేవస్తాడు రామారావు (అనసూయ మోహనరావులు వెళ్లిపోతారు. రామారావు బిక్కమొఖంతో పొయ్యివంక చూస్తాడు. అనసూయను తను చిన్నతనంనుంచీ ప్రేమిస్తున్న సంగతి మోహనరావుకి చెప్పాలనుకుంటాడు. కాఫీ త్రాగేటప్పుడు తప్పక చెప్పితీరుదామని నిర్ణయించుకొంటాడు) చెప్పితీరుతా (అంటాడు పెద్దగా కాఫీ కేటిల్ తో)

మోహనరావు:--అనూ రామారావు ఉండటము నీకిష్టమేనా.

అనసూయ:-(ఉలికిపడి) ఎందుకట్లా అంటున్నావు మోహన్ (పట్టెమంచముమీద కూర్చొనివున్న అతనిదగ్గరకు జరిగి కూర్చుంటుంది)

మోహనరావు:-అనూ, మిత్రద్రోహానికి సమకట్టాడు రాము (అనసూయ మరీ అతనిమీదికి ఒత్తుకుంటుంది. అతని చేతులు రెండూ గట్టిగా ఒత్తుతూ అంతులేని ఆవేదనతో అతని కళ్లల్లోకి చూస్తుంది) అనూ, నిన్నతడు ప్రేమిస్తున్నాడని నాకిదివరకు తెలియదు. అనూ! అనూ!! నిన్ను అతనో నేనో ఎవ్వరో ఒకరు వొదులుకోవాలి.

(అనసూయ మోహనరావుని గట్టిగా కౌగలించుకొంటుంది. అతని కళ్ళవెంట కారుతున్ననీటిని మృదువుగా తన కోమల కరపల్లవంతో తుడుస్తుంది. అనసూయకు ఆవేశము ఆగదు. శరీరం గగ్గుర్పాటు చెందుతుంది. ఆగని ఆవేశంతో మోహనరావు మెడను రెండు చేతులతో గట్టిగా కౌగలించుకొని అతని తలను ఒళ్ళో దూర్చుకొంటుంది.)

అనసూయ:-మోహన్ అతను యిప్పుడే వెళ్ళుతాడు. మోహన్ మోహన్, నిన్ను కష్టపెట్టలేను. అబ్బా నీవు కంటనీరు కారిస్తే చూడలేను. (ఇంతలో రామారావు కాఫీకాచానని కేకలు పెడుదూ వస్తాడు. మోహనరావు చివాలునలేచి నిలుచుంటాడు. అనసూయ వెళ్ళి కప్పుల్లో పోసి తీసుకొచ్చి టేబుల్ మీద పెడుతుంది. ముగ్గురూ కూర్చుంటారు కాఫీకి.)

అనసూయ:-రామారావ్, నేను కఠినంగా మాట్లాడుతున్నందుకు క్షమించాలి.

రామారావు:-అనసూయను నేను క్షమించుటా?

అనసూయ: అవును. రామారావ్, నీవు త్వరగా వెళ్ళవలెనని నాకోరిక; క్షమించు.

రామారావు:-అనసూయా. అంతేనా.

అనసూయ:-(నెమ్మదిగా) అంతే (రామారావు లేవబోతుంటాడు) రామారావ్, కాఫీ తాగింతరువాత (లేచినవాడు కూర్చుంటాడు.)

రామారావు:-అనసూయా, నేను వెళ్లబోయే ముందు ఒక్క కోరిక.

అనసూయ:-(ప్రేమ పురస్కరంగా) ఏమిటది రామారావ్.

రామారావు:-(దీనంగా) అనసూయా ఒక్కసారి వీణ వినిపించవూ.

(మోహనరావు కాఫీ తీసుకొంటుంటాడు. అనసూయ నెమ్మదిగా వీణ తీసుకొని వస్తుంది.)

మోహనరావు:-(అదోరకంగా చూస్తూ) అనూ...(అనసూయ తెచ్చే తెచ్చే వీణను తిరిగి పెట్టివస్తుంది.)

రామారావు:-అబ్బ మోహన్, నీవు వుత్త కఠినుడవు.

మోహనరావు:-నీవు మిత్రద్రోహివి కావా.

రామారావు:-నా ద్రోహానికి అనసూయను శిక్షిస్తావా. వీణను మీటుతూ అమృతగానం చేసి అమరలోకాన్ని సృష్టించే ఆనంద పిపాసిని అనసూయను ఆజ్ఞాపిస్తున్నావా. నిజంగా నీవు రాక్షసుడవు.

అనసూయ:-(ఆవేగంతో) రామారావ్. నీ చివరి కోరిక గూడా తీర్చలేనందుకు...అబ్బ... క్షమించు.

మోహనరావు:-రామూ. నాకు తెలుసు నీవు అనూని ప్రేమిస్తున్నావని. అనూ తిరిగి ప్రేమిస్తుందని గూడా తెలుసు. అందుకనే యిది యిప్పుడు తేలాలి.

రామారావు:-అబ్బ! నీలో హృదయం లేదు. ఏమి తేలాలి?

మోహనరావు:-నీ ద్రోహానికి నేను సహించలేను. నీవో నేనో ఎవరు కావాలో అనూ తేల్చ

కోవాలి. తప్పదు. అనూ నిర్ణయించినదానికి యిద్దరము బద్ధులము కావాలి.

రామారావు:-మోహన్. అనసూయ ఆటవస్తువనుకొన్నావా. ఎవరికి కావాలో తేల్చుంటానికి. ఆమెలో వ్యక్తిత్వము లేదనుకొన్నావా. ఎంత మొరటుమనిషివి.

అనసూయ:-అవును. అది తప్పదు? తేలాలి,

రామారావు:-అనసూయా తప్పదా. అయితేనే నిప్పుడే పోతున్నాను. అబ్బ! అనసూయను మన మిద్దరమూ పంచుకోటవమా. ఎంత కఠినము. ఈ నిర్బంధ విధానము నశింపదా. (కళ్లవెంట నీరు కారుస్తాడు.)

అనసూయ:-(ప్రేమ పూరితమైన ఆవేశంతో) రామారావ్. అబ్బా! క్షమించు. ఒక్కసారి వీణ వినిపిస్తాను విని వెళ్ళవూ (దీనంగా చూస్తుంది)

రామారావు:-అనసూయా వద్దువద్దు, వీణను వినిపించావంటే నేను తిరిగి అమరుణ్ణి అయి అమృతం కొరకు పోట్లాడతాను. వద్దు అమరుణ్ని కావద్దు. ఇట్లాగే పోతాను రాక్షసిలాగా; కాని అబ్బ, అనసూయా క్షమించు నా జీవితములో యిదే మొదటిసారి నీ ఆజ్ఞను తిరస్కరించటం. (దీనంగాచూస్తూ వెళ్ళబోతుంటాడు.)

మోహనరావు:-రామూ ఒక్కమాట.

రామారావు:-(ఆగి) త్వరగా చెప్పు. అనసూయ ఆజ్ఞను తిరస్కరించిన నాకు నిలుచుంటానికి ఎక్కడా తావులేదు. అధోలోకంలో తప్పితే అంతే దేవతా స్వరూపిణి అయిన అనసూయ ప్రక్కన నిలబడి కళంకము తేలేను. క్షమించు; పోవాలి.

మోహనరావు:-(ఆవేగంగా) రామూ నన్ను క్షమించవూ.

రామారావు:-మన యిద్దరినీ క్షమించవలసింది అనసూయ (అనసూయవంక దీనంగాచూస్తాడు)

అనసూయ:-రామూ రామూ (అతని కాళ్ళమీదపడి కాళ్ళను గట్టిగా కౌగలించుకొని హృదయానికి మరీమరీ హత్తుకొంటుంది. రామారావు శరీరం పులకరిస్తుంది.)

రామారావు:-అనూ అనూ అనూ (తన్ను కౌగలించుకొనివున్న అనసూయను మృదువుగా విడదీసుకొని బెంగగాచూస్తూ నిష్క్రమిస్తాడు.)


జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభఅంటే దేహ సౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిననారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేసు ప్రతి 1-కి 0-10-0 తపాలాఖర్చు వేరు:

మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టి నవల వెలువడలేదు. అపరాధాన్వేషణము అత్యద్భుతము.

గ్లేసు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,
సౌకారుపేట, మదరాసు.

లీలా
లేక
సురేంద్రనగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసమును యీ గ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు. 1-0-0

ఆర్యా బుక్ డిపో,
19 తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళికేణి, మదరాసు.